బిళ్లల మొలత్రాడు

[కథ]

•

= శ్రీ 'కరుణకుమార' =

[గతసంచిక తరువాయి]

రామిరెడ్డి పట్నం వెళ్లి నెల్లాళ్లు దాటింది. సుబ్బులు పెళ్లి వారం రోజు లుందనం గా వెళ్లిన వెళ్లడం. ఇదిగో పదిహేను రోజులుకు వస్తానని వ్రాసిన రెడ్డి కోతలయి కుప్పలుపడ్డా తిరిగి రాలేదు. కొబ్బరి తోటలో తన కొత్తకాపరం ఆ రెడ్డి చూచి ఆనందిం చాలని ఎంత మనస్సుపడుతున్నాడో సుబ్బులు-అంత కంతా రామిరెడ్డిరాక ఎడమేఅయిపోతోంది. ఎడ మయిన కొద్దీ సుబ్బులు కాఎడబాటు దుస్సహామై పోతోంది. ఇంటివద్గర భార్యాపిల్లలూ రెడ్డికోసరం కలవరించి పోతున్నారు. ఏమిటో ఆరోజు రెడ్డిమీద అతగాడికి మరులుపోయి, మనసు్న ఉండబట్టలేక లక్ష్మమ్మకాడికి పరుగెత్తి-

"అమ్మా! అయ్య యిన్నాళ్ళుగా రాలేదు. పట్నంలో ఏమిచేస్తున్నట్టు?" అని అడిగాడు.

"ఈ వూరు రామలింగేశ్వరస్వామికి ఆ కమ్మ వారిపాలెంలో ఏభయ్యెకరాల మాగాణీమాన్యం ఉన్నది. దానిని అవూరుకమ్మవారు పండించి, ఆవూరు దేవుడికి ఖర్చుపెట్టుతాంగాని నీ కివ్వడానికి లేదని పేచీ పెట్టారట. వీడు మన వూరు దేవుడికి ధర్మకర్త కాబట్టి ఆ భూములు స్వాధీనానికి వ్యాజ్యెం వేసి కోర్టు కెక్కి ప్లీడర్లతో మాట్లాడివస్తానని వెళ్లాడు-"

"మన వూరు దేవళానికి కమ్మవారిపాలెంలో భూము లెట్లా వచ్చినవి?"

"ఆ వూళ్లో కమ్మచలమానాయుడు, పిల్ల కాయలు లేక చనిపోతూ, తాను శివభక్తుడయినందు వల్ల, తన ఆస్తిలో యాభైఎకరాలు ఈ దేవుడికి వ్రాసి యిచ్చి చచ్చిపోయాడట."

"అట్లనా?"

"అది లగాయతూ దేవుడు మన వూళ్లోఉండినా, ధర్మకర్తలు ఆ కమ్మనాయుళ్లే ఉండి, ఈదేవుడికి పూజలూ, పునస్కారాలూ, ఉత్సవాలూ వాళ్లే చేసు కొంటూ వచ్చారు. నీటిమడవల తకరారుపడి ఏటిలో తలకాయలు పగలకొట్టుకొన్నప్పటినుండీ ఆ కమ్మ వారు పేచీ పెట్టుకొని భూముల మీద వచ్చే ఆదాయం వాళ్లవూరు రామస్వామి దేవళం క్రిందా, మాలమాదిగల చదువులక్రిందా, యూనాది సంఘాలకిందా ఖర్చుపెట్టు తున్నారట."

"నే నెరగను సుమా."

"మనవాడు ఈమధ్య పట్నంలో గొప్ప వాళ్లనీ, అధికార్లనీ, కలెక్టర్లనీ పట్టుకొని తాను ధర్మకర్తగా ఉండేటట్టు ఉత్తరువులు తెచ్చుకొని భూమిస్వాధీనానికి కోర్టులో దావాపడేశాడు. కాని ఆకమ్మవారు స్వాధీనం పడనిస్తారా! ఏదో అన్నరు పెట్టి హైకోర్టుదాకా తీసుకొని పోయారట వ్యవహారం."

"అబ్బా!"

"అసలు చలమానాయుడు వ్రాసియిచ్చిన వీలు నామా చెల్లదని వాళ్ళ వాదనట."

"బాగానే ఉంది!"

"వద్దురా నాయనా! ఆ దేవుడుమాన్యాలూ, బ్రాహ్మణ మాన్యాలూ మనకు వద్దు. మన కున్నది తింటే చాలు. మీ నాయన పరాయిసొమ్ము పాపిష్ఠి సొమ్ముగా చూచి పరువుగా బ్రదికి భళా అనిపించు కొన్నాడు. ఈకుమ్మ నీవు నెత్తికి తెచ్చిపెట్టుకో వద్దని శతవిధాల చెప్పాను. విన్నాడు కాదు." అని అంటూ లక్ష్మమ్మ లోపలికి వెళ్లిపోయింది.

సుబ్బులుకు తన సేద్యమేమో తనేమో అంతే గాని ఈ దేవరహస్యాలు తెలియవు. కాకుంటే ఈ వూరురెడ్డిగార్లకీ, ఆ వూరు కమ్మవారికీ బొత్తిగా సరి పడదనిమాత్రం ఎరిగున్నాడు. ఎరిగున్నా, ఏ విష యంలో పట్టినా కమ్మవారికంటె తన రెడ్డిచెయ్యే పై చెయ్యిలా కనిపించేది సుబ్బులుకు. తన రెడ్డి ఆ వూరుకి మునసబు. తహశీల్‌దార్లు, కలక్టర్లు, పోలీసు అధికార్లు-గొప్పగొప్పవాండ్లు గుర్రబ్బండ్లూ, మోటా రుకార్లూ వేసుకొని రెడ్డిగారింటికి రావడం, ఈయ నతో చెయ్యీ చెయ్యీ కలుపుకొని మాట్లాడడం, ఏవో నల్లనివీ, ఎర్రవీ నీళ్లు గ్లాసుల్లో పోసుకొని తాగడం—తన రెడ్డి జిల్లాఅధికారి ఉన్నట్టుంటాడు. ఈ మధ్య నాలుగునెలలక్రిందట తన రెడ్డి కేదో "సాహెబు" అని సర్కారువారు కొత్తగా పేరు కూడా పెట్టారని రెడ్డిగారిపల్లెలో ఎంతోమంది గొప్ప వాళ్లు వచ్చి, రెడ్డిగారిని ఎత్తయిన కుర్చీలో కూర్చో బెట్టి, మెడలో పూలదండలు వేసి పూజించి వెళ్లారు కూడాను. సర్కారువారుకూడా తనరెడ్డికి లొంగసా నయినట్లే కనిపించేది సుబ్బులుకు. చెన్నపట్నం దావాలో రెడ్డిగారే గెలిచితీరుతా రనుకొని, ఏమే మిటో ఆలోచించుకొంటూ ఇంటికి వచ్చాడు సుబ్బులు.

ఆ రాత్రికే పట్నంనుండి గ్రామానికి తిరిగి వచ్చాడు రామిరెడ్డి. గ్రామానికి వచ్చిన తర్వాతకూడా ఏవో తొందరపనులలో రెడ్డి వారం పదిరోజులదాకా ఇంటికాడ స్తిమితంగా ఉండడమే లేదు. ఒకరోజు మధ్యాహ్నం నాలుగుగంటలప్పుడు కాఫీ తీసుకొండా మని రెడ్డి దక్షిణపువాకిట్లోకి వచ్చేసరికి వసారాలో కూర్చుని ఒక పడుచుపిల్ల తన భార్యకు తలదువ్వి జడ అల్లుతోంది. పిల్లని చూచి, "ఎవరే ఈ మనిషి?" అని భార్య నడిగాడు.

కూర్చున్న మనిషి సిగ్గుపడి లేచి పక్క ధాన్యపు పురిచాటుకు తప్పుకుంది.

తన భార్య సమాధానం చెప్పేలోపల నే, "నువ్వు చూడనేలేదుటరా అబ్బాయీ! సుబ్బులు పెళ్లాం" అని కాఫీ కొడుకుచేతి కిచ్చి, "రమణీ! ఇట్లా రా అమ్మా" అని ఆమెచెయ్యి పట్టుకొని తీసుకొనివచ్చి, "రమణి అంటే రమణి కాదురా. మణిపూస. యానాదివాళ్లలో తప్పపుట్టింది. సుబ్బులు అదృష్టం కొద్దీ దొరికిం"దని రామిరెడ్డి ఎదురుగా నిల బెట్టింది లక్ష్మమ్మ.

కాఫీ గుటకలు మింగుతూనే ఆపిల్ల నట్లా పది సార్లు క్రిందినుండి పైనాకా మొఖమంతా కళ్లుచేసు కొని చూచాడు రామిరెడ్డి.

ఎడంగా నిలబడే, "నమస్కారమండీ బాబు గారూ." అన్నది రమణి.

రామిరెడ్డి పలక లేదు.

"ఆవూళ్లో యానాది సంఘాలవాళ్లు పెట్టించిన బడిలో చదువుకొన్నదట. చదువు రానివాడయినా, మేనత్త కొడుకని—సుబ్బుల్ని చేసుకొన్నది. ఈ కాలంలో చదువుకొన్న ఏ ఆడది చదువురానివాణ్ణి చేసుకొంటుంది చెప్పూ? దాని బుద్ధి బంగారుబుద్ధి" అన్నది లక్ష్మమ్మ.

రామిరెడ్డి ఇంకా గుటకలు మింగుతూనే నిల బడ్డాడు.

"అబ్బాయీ! వాడిపెళ్లికి నీవు లేవని సుబ్బులు ఎంత ఇదయిపోయాడనుకొన్నావూ! రెడ్డిగారు రెడ్డి గారు అని కలవరించిపోయాడంటే నమ్మ." అన్నది లక్ష్మమ్మ.

"అట్లాగే!" అన్నాడు రామిరెడ్డి.

"కొత్తబట్టలు కట్టబెట్టి పసుపు రాచి నేనే పెళ్లికొడుకుని చేశాను. బంగారు సవరొక టిచ్చి

పంపాను. ఎన్ని యిస్తేమట్టుకు సుబ్బులురుణం మనం తీర్చుకోగలమా నాయనా?" అని ఏమిటో పాఠం చదువుతోంది లక్ష్మమ్మ.

రామిరెడ్డి రమణిముఖంలోనికీ, ఆమెతొడుక్కున్న పొట్టిచేతుల జాకెట్టులోనికీ ఏవో వెర్రిచూపులు చూస్తూనే ఉన్నాడు. కప్పులో మరింత కాఫీ పోయించుకొని "సుబ్బులుకు మన కొబ్బరితోటలోనే గదూ నీవు యిల్లు కట్టించియిచ్చింది? మంచిపని చేశావు." అని తల్లిని మెచ్చుకొంటూ, వాకిట్లోకిపోయి చుట్ట నోట్లో పెట్టి అగ్గిపుల్ల ముట్టించాడు రెడ్డి.

"అత్తయ్యగారూ! ఆయన్ని చూస్తే నాకు కాళ్లల్లో దడపుట్టిందండి." అని లక్ష్మమ్మతో అని, రామిరెడ్డిభార్యవెనక్కి పోయి కొరవబడ్డ జడ అల్లుతూకూర్చుంది రమణి.

పొద్దుగ్రుంకినవెంటనే సుబ్బులుని ఒకసారి పిలిపించి, రమణిని పెళ్లిచేసుకొని తీసుకొనివచ్చినందుకు వాడికి అభివందనాలు చెప్పి సాగనంపాడు రెడ్డి.

రమణి తన దృష్టిలో పడిన పేళావిశేషం! రమణిశరీరంమీద అలంకారాలేమీ లేనేలేవు. బిళ్లారిగాజులు ఈ చెయ్యి కోజతా, ఆ చెయ్యి కోజతాను. ఎడమచేతి అనామికానికిమాత్రం ఒక వెండి ఉంగరం ఉన్నది. మెడలో పసుపురాచిన తాడూ, తాడుకు మంగళసూత్రమూను. కంఠానికి కొంచెం గుత్తంగా ఒక నల్లపూసల దండా, దండలో ఒక బంగారు మిరియంపూసా. ముక్కూ, చెవులూ బోసివే. కాళ్లకి మాత్రం వెండిగొలుసుల జత ఒకటి ఉన్నది. ఖద్దరు చీర కట్టుకొని, నీలిఅంచుఖద్దరురవికె తొడుక్కున్నది. ఎటు వచ్చీ ఆమెసిరిఅంతా కళ్లల్లోనూ, చుట్టుకొంటే తలనితన్నే నల్లని జెడచుట్టులోనూ నిలిచిపోయింది. ఇంతకుతప్ప ఆమెలో అలంకారాలేమీ లేవు. గాని, అన్నిటికీ మించిన నవయౌవనంమాత్రం మిసమిసలాడే తాచుపాముచురుకుదనంతో ఆమె నావరించి తేజస్సు వెదజల్లుతోంది.

ఆమెరూపాన్ని, సౌందర్యాన్ని, నేత్రాలనీ మరచిపోలేకపోతున్నాడు రామిరెడ్డి. వీథివాకిట్లో చుట్టకాలుస్తూ ఏకాంతంలో అట్లనే నిలబడిపోయాడు. మనస్సులో ఏదో చెప్పరాని బాధ, ఉద్రేకం, ఆవేదనాను. చెయ్యిపెట్టి కలచినట్లున్నది మనస్సులో. చుట్ట చేతికి తీసుకొని, తెల్లటికొడి దులుపుతూ-పరధ్యానమో ఏమో-కొడిరాలిపోయినపిదపకూడా చిటికెనవేలు నిప్పుమీద అట్లనే ఆడిస్తున్నాడు. ఘాటయిన చుట్టేమో, కింద పాదాలూ, చేతులూ, పైన తలా వేడెక్కి రక్తం బిరుగా ప్రసరిస్తోంది. చిటికెనవేలికి నిప్పు చుర్రుమనేవరకు అతని శరీరం జ్వరంతగిలినట్టయిపోయింది. దీర్ఘనిశ్వాసాలతో ముక్కుపుటాలు పెరిగి నోటిలోకి పీల్చిన పొగ ముక్కురంధ్రాలగుండా తెరలుతెరలుగా బయటికి కమ్ముకుంటోంది. దొడ్లోకి వెళ్లి ఇంకోసారి రమణిని చూడాలనిపించింది. చుట్ట పారేసి, "మంచినీళ్లు కాసినియ్యి అమ్మా." అంటూ మళ్లా దొడ్లోకి వెళ్లాడు. గాని అక్కడ రమణీ లేదు, తన భార్యా లేదు.

రమణి ఇంటికిపోయిందికాబోలనుకొన్నాడు రెడ్డి.

౨

ఫాల్గుణంవెళ్లి ఉగాది అందుకొన్నది. ఈ ఏడు కుప్పలన్నీ తొందరగా నూర్పించి ధాన్యంకొట్లో చేర్పించాలని రెడ్డికి తొందరపుట్టింది. ఏమో-కాలం చూడవస్తే బాగుండడం లేదు. యుద్ధం వచ్చి బర్మా నుండి బియ్యం సరఫరాకాక సర్కారువారు లేనిపోని కంట్రోళ్లుబెట్టి రైతులకంఠానికి గండకత్తెర తీసుకొని వచ్చారు. బెంగాలుదేశంలో బ్రహ్మాండమైన కరువు వచ్చి జనం తండాలుతండాలుగా చచ్చిపోతున్నారట. ఈ సంవత్సరం పైర్లన్నీ అసలు పొలంమీద ఉండంగనే దేశరక్షణాచట్టంక్రింద జప్తీచేసి సర్కారువారు స్వాధీనపరుచుకొంటారని ఆ మధ్య అనేకమయిన పుకార్లు బయలుదేరినవి. కోత లెట్లనో అయిపోయి కుప్పలుపడ్డవి. సర్కారువారు కుప్పలమీద స్వాధీనం పెట్టుకొన్నా పెట్టుకోవచ్చు. తన కెంత పలుకుబడి గల అధికారాలున్నా, చట్టం బయల్దేరి బిగుసుకొన్న తర్వాత తాను రావుసాహెబును అంటే విడిచిపెట్టు

తారా? అయినా, చెయ్యి కాలేదాకా పట్టుకొని కూర్చోడం దేనికి? ఎందుకయినా మంచిది—పొలం మీద ఉన్న పడికుప్పలూ తొందరగా నూర్పించి గింజలు కొట్లో చేర్చుకొంటే పడవే మీద దొంగతనంగా దాటేసే ఏకోస్తావర్తకులకయినా బ్లాకుమార్కెట్టులో బేరం తెగ్గొట్టుకొంటే కొన్ని కాకపోతే కొన్ని పుట్లయినా సర్కారుకు దక్కకుండా దాటించుకోవచ్చు. సుబ్బుల్ని పిలిపించి "మంచిరోజు చూచి ముందు బాడవచేలో పెద్దకుప్ప పడదొక్కించరా" అని చెప్పాడు రామిరెడ్డి.

రామిరెడ్డి ఆజ్ఞ సుగ్రీవాజ్ఞ సుబ్బులుకి. ఆ మరునాడే-తెల్లవారితే బేస్తవారమనగా, బుధవారం రాత్రికే కుప్ప పడగొట్టించాడు సుబ్బులు. అది సామాన్యపు కుప్పగాదు—అరవై డెబ్భయి పుట్లు అయ్యే అలివి మాలిన కుప్ప. తాటిచెట్టు ప్రమాణాన్న ఉన్నది. ఒకటోరకమైన జెట్టీవంటి మనుష్యులను నలభయిమంది మాలవాళ్లని కూలికి ఏర్పాటుచేసి ఇరవై ఇరవయివంతున వాళ్లను రెండు ఉద్దీలుగా ముడదలుపెట్టించి తూర్పుతట్టు ఒక ఉద్దీ,పడమటితట్టు ఒక ఉద్దీ కుప్ప ఎక్కించి వినాయకుడుకట్ట తాను దగ్గరనే ఉండి పడదోయించాడు సుబ్బులు. వంకాలు చేతిలో తీసుకొని ఆ రెండు ఉద్దీలవాండ్లూ కిలారించుకొంటూ కుప్ప ఎక్కేసరికి అంతలావు కుప్పా జవజవలాడి సన్నగిలిపోయింది. కుప్పపైకెక్కి తట్లు గూరేవాండ్లు మారుతుంటే, క్రింద పాలిబద్దలు చేతబట్టుకొని నూరు పెద్దపసరాలనూ కుప్పచుట్టూతిప్పి తొక్కించేవాళ్లు తొక్కించి, తొక్కిన గడ్డిని కలిమెట్టు కట్టేవాండ్లు కట్టుతున్నారు. అయిపాయె—రాత్రి రెండుజాములకు పడవేసిన కుప్ప తెల్లంగా తూర్పురేఖ లారేసరికే పూర్తిగా లోబడిపోయి గింజ దులిపి తొండివెంటిమీద కడిమికట్టడం కూడా పూర్తిఅయిపోయింది. ఇంక గడ్డి విదిలించి వామివేయడమే తరవాయి. పొద్దు పడమటికివాలేసరికి వామి పూర్తిగా వేసేసి, కళ్లంజారడం, చేగుదు వేయడంకూడా అయిపోయింది. ఆనాడు వడ్లు పోగుచేసి అడ్డపోతులు వేసేసరికి చీకటిపడినందున ఆ రాత్రికే ఇంకో జట్టు కూలీలను పిలిపించి వెంటనే తూర్పారబట్టాలని అనుకొన్నారుగాని చీకటిపడేవరకు పడమట కొద్దిగా మబ్బులేచి పైరుగాలి మట్టగించేసరికి ఆ పని నిలుపుదలచేసుకొని అడ్డబోతులుమీదనే ముద్రపిండి పెట్టి పలకఅద్ది గుర్తులుపెట్టించి, చినుకుపడినా నీరుదిగకుండా గడ్డికప్పించాడు సుబ్బులు.

ఆ రోజంతా సుబ్బులు పొలంపనిమీదనే నిలిచిపోయాడని రామిరెడ్డికి తెలుసు. అంతలావు కుప్ప పడదోసి తొక్కిస్తున్నప్పంటికీ తానొకసారి పొలం చాయ పోయి చూచిరావాలన్న ఆలోచన అతగాడికి తట్టనేలేదు. కనిచీకటి పడ్డతర్వాత ఒకసారి సుబ్బులింటికి పోయి ఏకాంతంలో రమణితో ముచ్చటించి రావాలనిమాత్రం ఆలోచన పుట్టింది. పోవాలనుకొంటే తన కభ్యంతరమేమున్నది? ఆయిల్లు దూరమా భారమా? తన మండువాలోగిలికి ఉత్తరం ధాన్యపుకొట్లూ, దాని వెనక పశువులసాలా, దాన్నానుకొని కొబ్బరితోటా, తోటలో ఈశాన్యంమూలన సుబ్బులు యిల్లూను. ధాన్యపుకొట్లూ, పశువులకొష్ఠం, కొబ్బరితోటా తణిఖీచేసికొంటూ వెళ్లినట్టు. ఒక్కడూ చేత కర్రపట్టుకొని సుబ్బులింటికి వెళ్లాడు. ఇంటిముందు పందిరిలో నులకమంచం వేసి యింటితలుపు గొళ్లెంబిగించి, యిల్లంతా నిశ్శబ్దంగా ఉన్నది. రమణి ఎక్కడకు పోయినదా అని ఆలోచనలో పడుతుండగనే ఇంటి వెనక తడికలచాటున నీళ్లశబ్దం వినవచ్చి రెడ్డి పడమటితట్టు తడికచాటుకు పోయి నిలబడి సందులోకి తొంగి చూచాడు. రమణి సున్నిపిండి తీసి కళ్లుమూసుకొని ముఖం రుద్దుకొంటోంది. రెడ్డి ఆ దృశ్యం చూడనూ లేకపోయాడు; ఆ స్థలం విడిచి బయటపడనూ లేకపోయాడు. పొలంనుండి సుబ్బులు ఇంటికివచ్చే వేళేమో అనిపించి, ఇది సమయం కాదని వెనక్కు తిరిగివెళ్లాడు.

రెడ్డి వైతొలగిన పావుగంటకే సుబ్బులు అసురుసురయి యింటికి ఘటం చేరవేసి నెత్తిమీది గుడ్డ తల క్రింద పెట్టుకొని నులకమంచంమీద వెల్లికిలా పండుకున్నాడు. పున్నమి ముందు దశమో ఏమో అప్పటికే చిక్కని వెన్నెల నల్లని కొబ్బరాకుల మీదుగా జర్రున

జారిపోతోంది. గాలికి కదిలే కొబ్బరాకులు వెన్నెట్లో వెండిబెత్తాలవలె తళతళ మంటున్నవి. ఆ చంద్రుని ధాటీకి తాళలేక సన్నటి చుక్కలు దూరంగా లేచిపోయి కొబ్బరాకుల సందుల్లో రెప్పలార్పుకొంటున్నవి. కొబ్బరిమట్టల సందున గూడుకట్టుకొన్న రెండు తెల్లకొంగలు వెన్నముద్దలవలె కూర్చొని సుబ్బులుదృష్టికి విందు గొల్పుతున్నవి. రెడ్డిగారి పశువులసాలలోని ఆవుదూడ అంబా అని పాలకోసరం అలవటించిపోతుంటే, చూడలేని గోమాత పొదుగులో పాలుచేపి మెడపలుపు లాక్కొంటూ మేత మేయడం మరచిపోతోంది. ఒక సన్నని పిల్లగాలి తెర సుబ్బులు చెవులో ఏవో రహస్యాలు చెప్పి పైకి లేచిపోయింది.

మంచందగ్గరగా వచ్చి, తన ప్రియుణ్ణి చూచుకొని, జాలిపడి, ప్రక్కన కూర్చొని, అతని చెక్కిలిమీద చెయ్యివేసి, నెన్నుదురు నిమిరి——

"ఉడుకునీళ్లున్నాయి. లేచి స్నానం చెయ్యి. బడలిక తీరుతుంది." అన్నది రమణి.

కన్నులు విప్పి చూచాడు సుబ్బులు.

"వయస్సులో నీకు తెలియడం లేదుగాని ఈ విధంగా వొళ్లు విరుచుకొని పనిచేస్తే, ఎంతకాలం తట్టుకొంటుం దీశరీరం? వేళ కిన్ని మెతుకులు తినడానికూడా నోచుకోలేదే? లే: లేచి స్నానం చెయ్యి" అంటూ సుబ్బులుమొఖంమీద చెక్కిలిపెట్టి, ఒక కన్నీటిబొట్టు అతగాడి కపోలంమీద విడిచింది రమణి.

"అన్నం తిని పెందలాడే పొలం పోవాలి మళ్లా. కళ్లంకాడ కాబ్దాకి ఎవ్వరూ లేరు. తొందరగా నీళ్లు పెట్టు; స్నానం చేస్తా"నంటూ సుబ్బులు కూర్చున్న రమణిభుజాలమీద చేతులానించి ఆమెను దగ్గరగా తీసుకొన్నాడు.

లేచి స్నానంచేసి అన్నం తిని చెప్పులు తొడుక్కొని కర్ర చేతపట్టుకొని కళ్లందగ్గరకు వెళ్లిపోయాడు సుబ్బులు.

కొబ్బరిచెట్టుమీది కొంగలు గూటిలో చేరి కూర్కుపెట్టినవి. ఆవుదూడ పాలుతాగి పడక వేసింది. దశమిచంద్రుడు కొబ్బరిచెట్లచాటుకు తప్పుకున్నాడు.

బోర్లించిన గంపమీద ప్రమిదదీపం పెట్టుకొని ఈతాకుచాపమీద కూర్చుని రాఘవయ్యగారు బహుమతిచేసిన "మాలపల్లి" తీసి కళ్లకద్దుకొని, నిన్నటి తరవాయి చదువుకొంటోంది రమణి.

"అగ్గిపెట్టె ఉంటే ఇయ్యి." అని అడుగుతూ వాకిట్లో ఒక మనిషి నిలబడి, చుట్టమొన కొరికి, పళ్ల సందున పెట్టి, నాలుకతో తడుపుతూ చేత్తో తిప్పుతున్నాడు.

పిడుగుపడ్డట్టనిపించి అదిరిపడి లేచింది రమణి.

"అగ్గిపెట్టె యిస్తా, చుట్ట కాల్చుకోవాలి." అని అగ్గిభిక్షం అడిగాడు ఆ మనిషి.

"ఎవరండీ మీరూ?" అని అడిగింది రమణి.

"మరచిపోయావా అప్పుడే? నేను రామిరెడ్డి" నన్నాడు ఆ మనిషి.

రమణిగుండెలు టపటప కొట్టుకొన్నవి. రెక్కలు టపటప కొట్టుకొంటూ గూటిలోనుండి బయటికి వచ్చి కొబ్బరిమట్టమీద వ్రాలినవి కొంగలు.

ఆ రామిరెడ్డిని మంచంమీద కూర్చోండని గౌరవించాలో, చుట్టముట్టించుకోను అగ్గిపెట్టె యివ్వాలో-ఇవ్వకూడదో-ఆమె కర్థంకాలేదు. కలగదొక్కుకొంటోంది రమణి.

"ఇంట్లో అగ్గిపెట్టె లేదా ఏమిటి పిల్లా? కొత్త కాపురం కాబోలుతే." అన్నాడు రెడ్డి.

"పొయ్యిలో నిప్పు ఉన్నదేమో తీసుకొనివస్తానుండండి" అని వంటింటిపొయ్యికాడికి పోయి చూచింది. కాని పొయ్యి శూన్యంగా ఉండిపోయింది. అగ్గిపెట్టె కనిపించలేదు.

వాకిట్లోకి వచ్చిన పెద్దమనిషికి చుట్టకాల్చుకోను నిప్పయినా లేదని చెప్పడానికి నోరురాక, ఆమె అగ్గిచూపితేనేగాని వాకిట్లోనుండి కదలనని శపథం పట్టినట్టు కనిపించే రెడ్డిని కాదనలేక——గంపమీద పెట్టిన వేపచమురు ప్రమిదదీపం తెచ్చి గడపలో నిలబడ్డ రెడ్డి కందిచ్చింది రమణి. రెండడుగులు ముందుకువేసి, ప్రమిద తాను తీసుకోకుండగనే, చుట్ట ముట్టించడానికి మూతి దగ్గరగా పెట్టినట్టే పెట్టి, ఉఫ్

అని ఆమెచేతిలో దీపం ఆరిపేశాడు రెడ్డి. ప్రపంచం అంధకారమైపోయి కళ్లు చీకట్లుకమ్మి గడగడ వణకుతూ చేతిలో ప్రమిద జారవిడిచి వెనక్కు తగ్గింది రమణి. గడపలోపల ఎడమకాలు పెట్టి,

"ఇంత భయ మెందుకు యానాదిపిల్లా?" అని అంటూ ఆమె చెయ్యి పట్టుకొన్నాడు రెడ్డి.

అన్నిటికంటెనూ బలవత్తమమైనది అవసరం. ఆమె కాఘడియలో ఏమేమి భావములు మనస్సులో పొడగట్టినవో, వాటి పరిణామమేమెా ఆమెకే తెలియని స్థితిలో,

"మీవంటివారి కిది తగదు." అంటూ ఆయన గుండెలమీద తన కుడిచెయ్యి అదిమి, బలముతో వెనక్కు ఒక్కతోపు తోసింది. అంతలావురెడ్డి బెండు ముక్క అయిపోయి గడపఅవతల ఆరడుగుల దూరంలో వెల్లకిలా పడిపోయాడు. తలుపుమూసి లోపల యినప గడియ బిగించింది రమణి.

ఏనుగువంటి రెడ్డి పీనుగయిపోయాడు. క్రింద మట్టిలో పడ్డ మనిషి లేచి గుడ్డలు దులుపుకొన్నాడు. రెక్కలు టపటపమని కొట్టి చప్పట్లు చరిచి అతన్ని వెక్కిరిస్తూ ఆ చెట్టుమీది కొంగలు ఈ చెట్టుమీదికి ఎగిరినవి. తన స్థితి చూచి చంద్రుడు చేసిన అపహాస్యం కొబ్బరిచెట్లసందుగా అతనిమీద పడి పీక్కొని తింటోంది. బిగించిన తలుపు తీయనేలేదు రమణి. ఇక తీస్తుందన్న ఆశకూడా కనిపించదు. ఆక్షణంలో రమణిని మసిచేయాలన్న క్రోధాగ్ని అతని గ్రుడ్లలో విషం కక్కుతోంది. ఆ యానాదిదాన్ని లోపలనే పెట్టి కొంపకు బయట నిప్పంటించాలని అతని కావేదన కలిగింది.

చొక్కా చేతులపైకి లాక్కొని తువ్వాలుతో వీపు దులుపుకొని ఒక విచిత్రమైన స్థితిలో ఇంటికి వెళ్లిపోయాడు రామిరెడ్డి.

౬

ఆరాత్రి రమణికి కాళరాత్రి అయిపోయింది. తలుపు తెరవడానికి భయపడి చీకటింటిలోనే ఉండిపోయింది. దీపం ముట్టించడానికి అగ్గిపెట్టె కనిపించలేదు. సుబ్బు లెత్తుకొనిపోయాడో ఏమో. చెయ్యి జారి ప్రమిద వాకిట్లోనే బ్రద్దలైపోయింది. కిరసనాయిలు రేషనింగులో సుబ్బులుసంసారం కరణంగారి జాబితాలో చేరనందున గ్రామంలోని ఇతర యానాది గుడిశలతోబాటు సుబ్బులింటికికూడా రేషనింగుకార్డు లేక బుడ్డిదీపంకూడా కరువే అయిపోయింది రమణికి. కమ్మవారిపాలెంలో తన తల్లి అవెన్యూ రోడ్లమీద ఏరితెచ్చిన వేపవిత్తనాలు ఎండబెట్టి ఆడించుకొన్న చమురు తాను వస్తూ ఒక దుత్తెడు తెచ్చుకొని దానిలో ఏకుల్లో దూదివత్తి చేసిపెట్టుకొని కాలక్షేపం చేస్తోంది. లోపల దీపం వచ్చేవిధం ఆమెకు కనిపించలేదు. ఎన్నడూ పిరికిదనమంటూ ఎరగని ఆమనిషి తన యింట్లో పేరుకొనిపోయిన గాఢాంధకారము భరించలేకపోతున్నది. లోపలనుండి ఎవరినన్నా పిలుద్దామన్నా తన ఇంటికి చుట్టుప్రక్కల దగ్గరలో ఇండ్లు లేవు. తన సుబ్బులు ఖామందు రామిరెడ్డి దగ్గిర ఇటువంటి చపలత్వం వున్నదని ఆమె ఎరగదు. తన నాథుడు ఇంటలేని సమయంలో ఆరెడ్డి ఇంతపనికి పూనుకోవడానికి కారణం తన బీదస్థితేగదూ? యానాదికులంలో పుట్టడమేగదూ తాను చేసుకొన్న మహాపరాధం? అదే తనతో సమాన హోదా గల మరొక రెడ్డిస్త్రీ అయినట్టయితే ఆరెడ్డికీదొమ్మ లుంటాయా? భోరున పొంగివచ్చే దుఃఖాన్నాపుకోలేకపోయింది. ఈతాకు చాపమీద పడిపోయి వెక్కి వెక్కి ఏడిచింది.

తనకు జరిగిన పరాభవం సుబ్బులుచెవిని పడితే ఏమవుతుందో? ఆమెఆవేదన మరణవేదనయిపోయింది. తానీసంగతి సుబ్బులుతో చెప్పడమా, చెప్పకపోవడమా??? "మామ!"అని మరిగిపోయే మనస్సుతో వెర్రిగా మొరిగింది. ఒక్క గూటిలో నివసించే పక్షులకు ఎడబాటు ఉండదని నమ్మింది. ఆసమయాన మామ తన కెంతదూరమైపోయినాడు! సప్తద్వీపములు దాటి పారిపోయినట్టు ఉన్నాడు ఆమామ. బాడవచేలో రెడ్డిగారి సొత్తు తన మామ కాపాడుతుంటే, తన మామసొత్తు దోచుకోడానికి వచ్చాడు రెడ్డి. అబ్బా! అని విలపించింది.

ఆమెరోదన అరణ్యరోదనమేనా ?

పడమటితట్టు కిటికీనుండి లోపల కొక్కసారి తొంగిచూచాడు దశమిచంద్రుడు. రాత్రి ఎంత పొద్దు పోయిందో, లోపల ప్రవేశించిన చంద్రకాంతి ఇంటిలోని అంధకారంతోబాటు రమణి మనోవేదననికూడా కొంత ఉపశమింపజేసింది. చంద్రబింబం పడమటికి ఏటవాలుగా దిగజారినకొద్దీ కిటికీలోని వెన్నెల ఇంటిలో గోడమీది కెక్కి గాంధిమహాత్మునిమీది కెగబ్రాకింది. ఆయనముఖంలో దివ్యతేజస్సు వెలిగిపోతోంది. చీరచెరగుతో కళ్లు తుడుచుకొని లేచివెళ్లి మహాత్మునిఎదుట మోకరిల్లింది. ఆ మహాత్ముడు ఆమె వీపు నిమిరి, "అమ్మా! నీవు నా కన్నతల్లివి." అని లేవనెత్తి దగ్గరగా తీసుకొన్నాడు. "భారతజాతికి పట్టుకొన్న పిశాచం దారిద్ర్యం ఒక్కటే కాదమ్మా! దారిద్ర్యంకంటె భయంకరమైనది పిరికితనం అని తెలుసుకో. కమ్మవారిపల్లెలో చదువుకొనేరోజులలో రాఘవయ్యగారి దగ్గర నీవు నేర్చుకొన్న ధైర్యం ఈనాడేమయింది తల్లీ! ఆ ధైర్యం ఏటిఅవతలనే అప్పచెప్పి ఈ గడ్డన పిరికిమందు తిన్నావా ? నిర్భయం, నిర్భీతి— దీనిని మననంచేయి. సత్యాన్ని మరచిపోకు. అహింసని విడిచిపెట్టకు. నీవంటివాళ్లు పిరికితనంతో కంటనీరు పెట్టుకొని ఏడుస్తుంటే నీ యానాదిజాతికే కాదు, అసలు భారతజాతికే బ్రదుకేదీ ? ఏడుపు వీరుల లక్షణం గాదు. చూడు : ఒకానొక రాక్షసుడు వచ్చి నీ నఖశిఖపర్యంతం కసాయివాడి కత్తితో చెండాడుతున్నా, నీవు కంపించకూడదు తల్లీ! అప్పుడే నీకు స్వాతంత్ర్యం, స్వేచ్ఛా, గౌరవమూను... లే: లేచి నీవు ధైర్యం అవలంబించి నీ మామకు ధైర్యం చెప్పు." అని ఆయనేమో తనకి చెప్పుతూనే ఉన్నాడు. చంద్రకళకు పడమటికొండ అడ్డుతగిలి తిరిగి తన ఇంట్లో అంధకారమే అలుముకొన్నది. నవనాళ్లూ పట్టువదలి ఆమె క్రింద పడిపోయింది.

ఆ పడినపడడం ఎంతసేపు పడిపోయిందో - తూర్పురేఖలారి వాకిట సుబ్బులు వచ్చి, 'రమణీ' అని తలుపుతట్టేవరకూ ఆమెకు మెలకువరానేలేదు. అమృతోపమానమైన ఆ ప్రియుని వాక్యం చెవినిబడంగనే లేచి, దూకి తలుపు తీసింది. "ఇంకా నిద్రేనా" అని సుబ్బు లేమో చెప్పబోతుండగనే, "మామా! వచ్చావా! ఇట్లా రా! అబ్బా!" అని తలుపుమూసి, అతని ఆపాదమస్తకమూ, ప్రతిరోమకూపమూ, అతని ప్రతి పరమాణువూ ఆరాధించి,తన ఆత్మ-తన సర్వస్వం అతనిలో ప్రతిష్ఠించింది. అతనిని కదలనివ్వదు. తాను కదలదు. అర్ధగంటకాలం ప్రియుని ఉపాసించినమీదట ఇరువురికీ శరీరాలు తేలిక అయిన వెంటనే లేచి బయటకు వచ్చారు.

చద్దినీళ్లు త్రాగి పొలంవెళ్లిపోయాడు సుబ్బులు. రోజూ ఒకసారి రెడ్డిగారి భార్యదగ్గరకు వెళ్లివచ్చే అలవాటు. ఆ నాడు ఇల్లు కదలలేకపోయింది రమణి. ఆ రెడ్డిగారింట్లో అడుగుపెట్టడానికి రోతనిపించింది. పెందలకడనే వంటచేసి, పెనిమిటికి పైటన్నం కళ్లం దగ్గరకే పంపించి, తా నింత తిని తలుపు బిగించి దీర్ఘాలోచనలో పడింది రమణి.

ఇంతటితో తనని రెడ్డి విడిపిస్తాడా. జరిగిన పరాభవం అతనిలోని పౌరుషాన్ని నుమడింపజేస్తుంది గాని, పుట్టిన తాపాన్ని శమింపజేస్తుందా ? తనతోబాటు సుబ్బులుకూడా ఆ రెడ్డి ఆగ్రహాగ్నికి ఆహుతి అయిపోతాడేమో ? రమణి కంపించింది.

ఆ రాత్రి జరిగిన విషయం తన మామకు తెలియదు. ఆయనచెవిని వేయకుండా దాచడం ఎట్లా ? ఆమామసందునా తనసందునా దాపరికా లుండవచ్చునా! ఆమె కాదినమంతా కలవరపాటే మనస్సులో.

మహాత్ముని ఆత్మచరిత్ర తీసి చదువుకొన్నది. దక్షిణాఫ్రికాలో మోటారులోనుండి దిగిపొమ్మని ఒక తెల్లదొర మహాత్ముని చావగొట్టుతున్నాడు. ఆయన లక్ష్యపెట్టడంలేదు. "మాలపల్లి" తీసి చదువుకొన్నది. తన కూతురుశీలం కాపాడడానికి శిరస్సు తీసి నేలమీద పెట్టుతానని రామదాసు జ్యోతికి అభయప్రదానం చేస్తున్నాడు.

రమణి లేచింది. రాటం త్రిప్పింది. ఏదో పాట పాడింది. వాకిలి చిమ్మింది. తల దువ్వుకొని స్నానం చేసింది. మంచిగుడ్డలు కట్టింది. ముఖాన్న కుంకుమ

పెట్టింది. మహాత్మునికి దీపారాధన చేసి, పూజచేసింది. అదివరకు నాయకుల మెడలో కట్టిన వాడిలిపోయిన పాతపూలదండలు తీసేసింది. తాను వొడికిన నూలు చిలపలు నలుగురికీ నాలుగు మెడలో కట్టింది. వారంద రికీ మొఖాన్న కుంకుమ పెట్టి, లేచినిలబడి కన్నులు మూసి దణ్ణం పెట్టింది.

ప్రొద్దుగ్రుంకి ఇంటికి రాగానే సుబ్బులుకు ఉడుకునీళ్లు పోసి కుంకుడుకాయతో వళ్లూ వీపూ రుద్ది స్నానం చేయించింది. అతని తలకి కొబ్బెర చమురు రాచి, తల దువ్వి ముడికట్టింది. అన్నం విస్తట్లో వడ్డించి—

"ఈ పొద్దుకూడా తిరిగీ పొలం పోవలెనా" అని అడిగింది.

"ఆహా!" అన్నాడు సుబ్బులు.

"ఎప్పటికయ్యేను ఈ కుప్పనూర్పిళ్లు?"

"కళ్లం పూర్తిగా జారి ధాన్యం యింటికి చేరే సరికి ఇంకా రెండురోజులు పట్టుతుంది."

"మామా! నీవు ఈ వరసన పగలూ రాత్రీ పొలం లోనే కాపరం చేయి. నేను ఇంటికాడ ఒక్కర్తినీ అల్లాడిపోతుంటా" నన్నది రమణి.

"పనిపడ్డప్పుడు వొళ్లు దాచుకొంటే ఎట్లా? పెళ్లాన్ని కరుచుకొని ఇంటికాడ కూర్చుంటే కడుపు లోకి బువ్వో!" అని ఎగతాళిగా మాట్లాడేడు సుబ్బులు.

"ఇంటికాడ రాత్రిళ్లు నేను ఒక్కదాన్నీ ఉండలేక ఇదవుతున్నాను. రాత్రిపూటకూడా నీకు పొలంలో పని ఉంటే నేనూ వస్తాను పద. ఇద్దరం ఆడనే ముడుచుకొందాం" అన్నది రమణి.

"నే వద్దన్నానా? కళ్లంకాడనే గడ్డి కప్పి గుడిశ పెట్టించా. వరిచెత్తమీద చాపేసి పండుకుంటే, ఆ చల్ల గాలికి వొళ్లు తెలియదు." అన్నాడు సుబ్బులు.

ఇద్దరూ అన్నం తిని లేచి చెయ్యి కడుక్కొన్నారు. వక్కా, ఆకూ పెనిమిటి కిచ్చి, తానుకూడా ఇంత నోట్లో వేసుకొన్నది. పొద్దుపోయింది. ఊరు మాటుమణిగింది. తొందరగా వెళ్లి కళ్లంకాడ మనిషి నింటికి పంపితేనేగాని వాడికి భోజనానికి పొద్దు పోతున్నదని సుబ్బులనేవరకు, రమణి తలుపు బిగించి, పెనిమిటితో కళ్లంకాడికి పయనమైవెళ్లింది.

౧౦

గతరాత్రి తలుపు వేసుకొని చీకటింట్లో రమణి ఎంత వేదన పడిందో దానికి రెండింతలు మరణబాధ పడుతున్నాడు ఇంటిదగ్గర రామిరెడ్డి. ఆ రాత్రంతా అతనికి కంటిమీద కునుకుపట్టితే వొట్టు!

రమణివంటి మనిషి తనకు చిక్కకగాదు. తాను తలుచుకొంటే ఆ గడ్డన కాదనడాని కెవరికి దొమ్మ లున్నాయి? తనవిషయం రమణి కింకా తెలియదేమో గాని, గ్రామంలో ఆబాలగోపాలమూ ఎరిగిన సంగతే. ఇంటికాడ చేసుకొన్న భార్యగాక అతను సాలిమనిషి పడుచుపిల్ల పెనిమిటిని ప్రోత్సహించి మిలిటరీలోనికి పంపి, ఆ పిల్లను తను దగ్గరచేరదీసి, దానికి పిల్లకాలవ గట్టున పెంకుటిల్లు కట్టించి, దానిపేర రెండెకరాల కయ్య సెటిల్‌మెంటువ్రాసియిచ్చి పోషిస్తున్నాడు కూడాను. మొగవాడి జీవితంలో అప్పుడప్పుడు కొత్త రుచులు చవిచూస్తుంటేనేగాని అందంలేదు. అంత కాళ్లూ, చేతులూ కట్టివేసుకొని పడిఉండడానికి తన కేమికర్మం కాలింది? చేతిలో డబ్బులేకనా, పలుకు బడి లేకనా, వంట్లో రక్తమాంసాలు లేకనా? నిజా నికి చెప్పాస్తే తనవంటి రెడ్డికి ఆమాత్రపు పటాటోపం లేకుంటే ఈ కాలపు సంఘంలో చిల్లిగవ్వకు పనికి వస్తాడా తను? అసలు ఆ వూళ్లో రెడ్డిగారి ప్రాపకం దొరికితేనే చాలునని అల్లాడుతూ ఉంటారు అలగాజనం.

అలగాజనం లెఖ్ఖేమిటి? రెడ్డిగారి పల్లెకు ట్రాన్సుఫరయివచ్చిన బోర్డుస్కూలు అయ్యవారమ్మలు ఎంతమంది తన మనస్సు మెప్పించి వెళ్లిపోలేదు? ఈ సారి వచ్చే ఎన్నికలలో తాను జిల్లాబోర్డు ప్రెసిడెంటు పదవికి ఎన్ని వేలయినా ఖర్చుపెట్టి పోటీచేస్తున్నాడు కూడాను.

అటువంటి రెడ్డిని కాదని కాలతన్నిందే ఈ యానాదిది ? దీని భృగువెంత, ఇది ఎంత ? అది నెట్టిన నెట్టడానికి-అబ్బా !—గుండెలమీద నొప్పిపెట్టడమే గాక, విసురుమీద వెల్లకిలా పడడమేమో, నడుం బెణికినట్టుకూడా ఉన్నది. రవంత వల్లతప్పితే ప్రక్కనే ఉన్న పచ్చడిబండమీద పడవలసింది తల. దేవుడి దయవల్ల తప్పిపోయింది.

యానాదిదాని కింత తలపొగరేమా అని రెడ్డి క్రోశం. దేనిని చూచుకొని దీని కింత మిడిసిపాటు తనం ? తన కిట్టి పను లిష్టంలేకపోతే, పెద్దమనిషితో ఆ సంగతి నెమ్మదిగా చెప్పుకోరాదూ ? మెడబట్టి నెట్టవలసిన ప్రమేయ మేమివచ్చిందీ ?

అయినా ఈ వ్యవహారంలో తనదే లోప మేమో ! అది యానాదిది, కేవలం మూఢురాలు, దరిద్ర కొట్టుది. ముందుగా ఇంత డబ్బాశపెట్టి, నైతరంగా బుజ్జగించియుంటే లొంగుబాటులోకి వచ్చియుండేది. తొందరపడి, పెద్దపులిపడ్డట్లు ఒక్కసారిగా మీదపడే వరకు, పాపం ! పసిపిల్ల బెదురుకొన్నది. పశ్చాత్తాప పడ్డాడు రెడ్డి. ఈ వ్యవహారంలో మరి రెండోవాడి జోక్యంలేకుండా తనే అతిరహస్యంగా సారథ్యం చేసుకొని ఆ రమణిని సాధించుకోవాలని దృఢనిశ్చయం చేసుకొన్నాడు.

చుట్ట తీసి ముట్టించాడు. ఒక వందరూపాయల నోటు తనది కాదనుకొంటే కొండమీద కోతికూడా దిగివస్తుంది; రమణి ఒకలెఖ్ఖా అనుకొన్నాడు. మర్నాడు రాత్రి పదిగంటలకు తిరిగీ రమణిఇంటికి పోయి, "భయపడకు. ఇదిగో వందరూపాయలు. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డువేస్తా. సుబ్బు లేమను కొంటాడో అని సందేహించకు. నా విషయంలో వాడు సంతోషిస్తాడుగాని, విచారించడు. నిన్నూ వాణ్ణీకూడా బంగారుపిచ్చుకల్ని చేస్తాను." అని తను స్వయంగావెళ్లి బుజ్జగిస్తే ఆమె తన చేతిలో వెన్న ముద్దలా కరిగిపోదూ !

రెడ్డిమనస్సు ఉరకలువేస్తోంది. కళ్లంలో కుప్పసంగతి మరచిపోయి, ఆ రోజంతా చీకటి కోసరం తపస్సుచేశాడు.

సూర్యుడస్తమించి అతని తపస్సు ఫలించింది. శుక్లదశలో చంద్రోదయమైనా అతనికి దోహదమిచ్చి ఆప్యాయంగానే ఉన్నది. బాగా చీకటిపడి, సుబ్బులు అన్నం తిని కళ్లంకాడికి పోయేసరికి రాత్రి పదిగంట లవుతుంది. కాళ్లకి చెప్పులు తొడుక్కొని, చేత కర్ర బుచ్చుకొని, జేబులో నోటుకాగితం పెట్టుకొని, సుబ్బులింటికి వెళ్లి చూచుకొన్నాడు. తలుపు తాళం వేసి ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నది. అతనికి కాళ్లు చల్లబడినవి. పెనిమిటితోకూడా కళ్లంలోనికి పోయింది కాబోలనుకొన్నాడు. అతనికి భయంకూడా వేసింది. స్తిమితం చెడి, సాలిమనిషింటికి పయనమైవెళ్లి పోయి నాడు.

౧౧

పున్నమిగడియ లెదురయినకొద్దీ చందమామ కళలు ముదురవుతూ ఉన్నవి. చైత్రమాసపు గాడు పేమో, పగలు కాచిన ఎండతీక్షణం రాత్రి కాచే వెన్నెలకు వెయ్యిరుచులు కలిగిస్తోంది.

ఇంటికాడ బయల్దేరిన రమణీసుబ్బులు పిల్ల కాలవగట్టెక్కంగనే చెట్టాపట్టాలేసుకొని ఆ వెన్నె ట్లో విర్రవీగిపోతున్నారు. ఊరినుండి ఒకమైలు నడిస్తే రెడ్డిగారి బాడవచేను. చేనుప్రక్కనే రెడ్డిగారి చిన్న చెరువూను. పిల్లకాలవలోకి నీళ్లు వచ్చినవెంటనే చెరు వుకు నీళ్లునింపుతారు. సుబ్బులు వెళ్లి కళ్లంకాడ కాపలామనిషి నింటికి పంపివేశాడు.

సుబ్బులుకూ, రమణికీ ఆ రాత్రి నిద్రవచ్చేటట్టు లేదు. బ్రహ్మాండమైన పెద్దకళ్లం. కళ్లంచుట్టూ కోట గోడలా వలయాకారపు గడ్డికడిమె. వలయంలో నట్ట నడుమున పోశారు అడ్డపోతులూ వడ్లరాసీని. తూర్పార పట్టిన రాశిలో కీడిశలూ, తరకలూ ఇంకా తొలగించనే లేదు సేద్యగాళ్లు. కళ్లంలో నిలిచిన గోరిగింజల కోసరం మాలెతలు చిమ్మివెళ్లిన కళ్లంగాబోలు, వెన్నెట్లో అద్దంలా మెరిసిపోతోంది. తరకలు తొలి గించివేస్తే, మేలురాసి వాగళ్లంకాడ పోయించి గంప లతో శలగలు కొలిపించి బస్తాలు బళ్లకెక్కించడమే తరవాయి.

కడింకట్టిన వాగళ్లంచుట్టూ రమణీ సుబ్బులు తిరుగుతున్నారు. ఒకసారి చెరువుగట్టెక్కారు. కలక తేరిన నీటిపై తేలిపోయే కలవపూలు గడకొంకితో గట్టుకు లాగి, రేకు లేర్చి, రమణిజడలో తురిమి ముక్కుదగ్గర పెట్టుకొన్నాడు సుబ్బులు. గట్టుమీద కలకత్తా జామిచెట్టున రమణిలా దోరముగ్గిన పండొకటి కోసి తన ప్రియురాలి కిస్తే ఆమె సగం కొరికి ప్రియుని నోటి కందిచ్చింది. ప్రక్కనున్న మామిడిగున్నలు విరియబూసి కమ్మని సువాసనలు కళ్లంపైకి సాగనంపుతున్నవి. రెండు పావురాయిలజంట కళ్లంలో ముక్కు లీడ్చుకొంటూ పాటపాడుతున్నవి. పిల్లకాలవగట్టున టెలిఫోన్ తీగెలమీద రెండుకోయిలలు వాలి ఉయ్యాల ఊగుతూ పావురాయిల పాటకు శ్రుతికల్పుతున్నవి. రాత్రిపూట దారితప్పిన రెండు పందుకోతులు కళ్లంలో జొరబడి అల్లరి చేయసాగినవి. గుడిశలో చాప బయటికి లాగి, గడ్డి పరచి ప్రక్క వేశాడు సుబ్బులు. తాటాకుతో అల్లిన గడ్డిదిం డొకటి తలక్రింద పెట్టింది రమణి.

సుబ్బులు నడుము వాల్చాడు. రమణికి నిద్ర రాదు: మనస్సు కలగుండుపడిపోతోంది. ఆమె నిల దొక్కుకుంటోంది. ఆమెమనస్సులో చెలరేగిన తుపాను అతనికి తెలియదు.

పెనిమిటిప్రక్కలో కూర్చున్నది. ప్రియుని వక్షస్థలంపై చెయ్యివేసి నిమిరి—

"మామా !" అని పలకరించింది.

"ఊ" అన్నాడు సుబ్బులు.

"నీవంటి మామ దొరకడం నా అదృష్టం." అన్నది రమణి.

రమణిని దగ్గరగా తీసుకొన్నాడు సుబ్బులు.

"ఇంటికాడ ముసలివాళ్లు - మా వూరు కమ్మవారు - రాఘవయ్యగారూ నిన్ను తలుచుకొని ఎంత మెచ్చుకొంటారో నే చెప్పలేను."అన్నది రమణి.

తానొక మహాసామ్రాజ్యానికి చక్రవర్తి అయినట్టు పొంగిపోయాడు సుబ్బులు.

"ఎన్నిజన్మ లెత్తినా-నువ్వూ నేనూ ఇట్లనే పుట్టాలని నా కోరిక."

ఆమెచెక్కిలిపై తన పెదవులు మెదిపాడు సుబ్బులు.

"మామా ! నా కేసి చూడు."

"..................."

"నీతో ఒక్కసంగతి చెప్తాతా: ఎవ్వరితో చెప్పనని నాచేతిలో చెయ్యివేయి. " అన్నది రమణి.

సుబ్బులుగుండె దడదడమన్నది. చేతిలో చెయ్యి వేశాడు.

"నీవు ఈరెడ్డిని వదిలించుకోవాలి మామా."

సుబ్బులు నడుముజారిపోయి—

"ఎందువల్ల ?" అని అడిగాడు.

"ఆయనసంగతి నీవు ఎరగవూ ?"

"ఎరుగుదును."

"ఆయింటిలో మనం ఉన్నట్టయితే ఆరెడ్డి నన్ను నీకు దక్కనీయడు."

"అంటే ?" అన్నాడు సుబ్బులు.

ఆమెనోరు పెగలలేదు. గొంతుక బిగుసుకొని పోయినట్టయి, అతని కంఠం చుట్టవేసింది.

అతని హృదయం, ఆమెహృదయం శరవేగంతో కొట్టుకొనిపోతున్నవి.

"ఎందు కీఏడుపు? "అని ఆమెకన్నీరు తుడిచాడు సుబ్బులు.

"నిన్నరాత్రి నీవు యింటికాడ లేకుండా చూచి, రెడ్డి మనింటికి వచ్చి దీపమార్చి నన్ను చెయ్యి పట్టుకొన్నాడు."

సుబ్బులుచెవులలో హోరు బయల్దేరింది. రెండు చెవులూ మూసుకొని, చాపమీద వొరిగాడు.

"నాకు వొళ్లుమండి మెడబట్టి నెట్టాను. ఆయన క్రిందపడ్డాడు. నేను తలుపు బిగించాను."

"ఆ!" అన్నాడు సుబ్బులు.

సుబ్బులుకు ముచ్చెమటలు పోసినవి. వరికళ్లం గిర్రున కుమ్మరిసారె తిరిగినట్లు తిరిగిపోతోంది. కళ్లు మూసుకొన్నాడు. తెరిచాడు: చంద్రబింబంలోని కళంకం నల్లగా మసికప్పి అసహ్యమనిపిస్తోంది. చేతులు నడుముకానించి నిలబడ్డాడు.

"ఈసంగతి నువ్వు ఎవరితోనన్నా చెప్పినట్టయితే, నన్ను చంపుకొన్నట్టే"అని ముదలకించింది రమణి.

సుబ్బులుకళ్లల్లో రామిరెడ్డీ, లక్ష్మమ్మా కదిలారు. కళ్లు మూసుకొని భోరున ఏడిచాడు. చీరచెరగుతో అతన్ని విసురుతో—

"మామా! ఎందు కాయాసపడుతావు? ఈ రెడ్డిని వదిలించుకోలేకనే ఈభయమంతా?"

సుబ్బులు పలకలేదు.

"నీకు ఇంతటి ఘోరం తలపెట్టిన మనిషిదగ్గర నీ వింకా ఉండవచ్చునా?"

సుబ్బులు మాట్లాడలేకపోతున్నాడు.

"నీవూ నేనూ కుక్కలం, పశువులం అనుకొన్నాడు రెడ్డి. కూటికిగతిలేని దరిద్రులు, నీకూ నాకూ విషంపోయాలని తలచాడు రెడ్డి."

సుబ్బులు కళ్లువిప్పి ఆమెముఖంలోకి చూచాడు.

"ఆనాడు మనకు రాఘవయ్యగారు చేసిన ఉపదేశం మరచిపోయావా? కూటికి బీదలమైనా, గుణానికి మనం బీదలం కామని ఈరెడ్డికి తెలియజెప్పాలి. భయపడి, దేహీ అంటే, నెత్తి అణగతొక్కుతారు బలవంతులు. నిలదొక్కుకొని ఎదురుతిరిగితే కాలు కదపలేరు. పిరికిపందలు."

పకిలించాడు సుబ్బులు.

"ఈ కమతం విడిచిపెట్టితే బ్రదకలేనని నీకు భయం వద్దు. నీకు నేనున్నాను; నాకు నీవున్నావు. మనిద్దరికీ రాఘవయ్యగారున్నారు. లే! వెళ్లి రేపే రెడ్డితో చెప్పి చక్కా రా: వెళ్లిపోదాం."

"లక్ష్మమ్మని విడిచిరావడం ఎట్లా రమణీ?" అని అడిగాడు సుబ్బులు.

"ఆమె ఈకొడుకుని విడిచిపెట్టి వేరే కాపరం పెట్టితే అప్పుడు నువ్వూ నేనూ ఆమెపాదాలు వొత్తుదాం."

"ఆమె అడిగితే ఏం చెప్పేది రమణీ?"

"నేను రమ్మని లాక్కునిపోతున్నానని నామీద చెప్పు."

"అయితే కమ్మవారిపాలెం వెళ్లుదామంటావా?"

"కమ్మవారిపాలెం నీ కిష్టంలేకుంటే, మరొక పాలేనికి పోదాం."అన్నది రమణి.

చంద్రు డస్తమించి, చీకటిపడి తూర్పురేఖలారకుండానే రమణి నింటికి తీసుకొనిపోయినాడు సుబ్బులు.

రామిరెడ్డికమతం విడిచిపోవడానికి నిశ్చయం చేసుకొని, బాడవచేలో కుప్ప నూర్పించడం అయిన మర్నాడు రమణిని ముందుగా కమ్మవారిపాలెం పంపించి, తాను వెనకనే నిలబడిపోయాడు.

[తరువాయికథ తరువాతి సంచికలో]